నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, శుక్రవారం 3 జనవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


పరుగుపందెంలో క్రీడాకారులు

# పతకాల పంట

- అథ్లెటిక్స్‌లో తొమ్మిది, రెజ్లింగ్‌లో ఏడు మెడల్స్
- సత్తాచాటిన హనుమకొండ అథ్లెట్లు
- జేఎన్‌ఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు


జావెలిన్‌త్రో..

హనుమకొండ చౌరస్తా, జనవరి 2 : రాష్ట్రస్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీల్లో హనుమకొండ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. మూడు రోజులుగా జవహర్‌లాల్ నెహూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో జరుగుతున్న క్రీడలు గురువారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన క్రీడాంశాల్లో హనుమకొండ జిల్లా అథ్లెట్లు సింథటిక్ ట్రాక్‌పై పరుగులు తీసి తొమ్మిది పతకాలు సాధించగా, రెజ్లింగ్‌లో ఏడు కైవసం చేసుకున్నారు. గురువారం జరిగిన పోటీలను సీఎం ఓఎస్డీ రవీందర్‌రెడ్డి ప్రారంభించి నిర్వహణపై డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలపై కోచ్‌లు, మేనేజర్లను అడిగి తెలుసుకోవడంతో పాటు భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

**అథ్లెటిక్స్‌లో..**

మూడు రోజుల పాటు జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో హనుమకొండ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చి 9 పతకాలు సాధించారు. అండర్-20 లాంగ్‌జంప్‌లో అంజి, సీనియర్ బాయ్స్‌లో దిలీప్ సిల్వర్, జూనియర్ బాయ్స్ 100, 200 మీటర్లలో ఎండీ కైఫ్ సిల్వర్, 600 మీటర్లలో కే ప్రణీత గోల్డ్, 100 మీటర్లలో పోశయ్య బ్రాంజ్, 400 మీటర్లలో కార్తీక్ సిల్వర్, షాట్‌పుట్‌లో రాహుల్ గోల్డ్, జావలిన్ త్రోలో స్వాతి బ్రాంజ్ మెడల్ సాధించారు.

**రెజ్లింగ్‌లో..**

రెజ్లింగ్ పోటీల్లో హనుమకొండ జిల్లా రెజ్లర్ల హవా కొనసాగింది. రెజ్లర్లు అద్వితీయ ప్రతిభ కనబరిచి 4 స్వర్ణ, ఒక రజత, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. సబ్ జూనియర్ 60 కేజీ విభాగంలో వీ గణేశ్ గోల్డ్, 53 కేజీల్లో బీ అంజలి, 48 కేజీల్లో ఎస్ అర్జున్‌సాగర్ కాంస్య, జూనియర్ బాలికల 50 కేజీల్లో బీ ప్రణవి, 59 కేజీల్లో జే చిన్ని, 61 కేజీల్లో కొర్ర అఖిల్ గోల్డ్, 57 కేజీల్లో ఏ రాహుల్ రజత పతకం సాధించారు. కాగా, పతకాలు సాధించిన క్రీడాకారులను డీవైఎస్‌వో అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, కోచ్ శ్రీమన్నారాయణ, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, వరంగల్, హనుమకొండ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు వై సుధాకర్, షేక్ రియాజ్, కోచ్‌లు కందికొండ రాజు, ఎం జైపాల్ అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ దేవేందర్‌రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



రెజ్లింగ్ పోటీల్లో మెడల్స్ సాధించిన హనుమకొండ జిల్లా క్రీడాకారులు


హనుమకొండలో మహార్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

# వేషం కట్టి.. మాస్కు పెట్టి

- హనుమకొండలో రోడ్లపై కళా ప్రదర్శనలు, భారీ ర్యాలీ
- జనగామలో ముఖాలకు మంత్రుల ఫొటోలతో దీక్ష
- సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన


వివిధ వేషధారణల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు

హనుమకొండ/జనగామ చౌరస్తా/ ములుగు రూరల్ : తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలన్న డిమాండ్‌తో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. గురువారం వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. హనుమకొండలో శివుడు, పోతరాజు, రుద్రమదేవి, గణపతి, భరతమాత, సమ్మక్క, సారలమ్మ తదితర వేషధారణతో ఉద్యోగులు కీర్తి స్తూపం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు మహార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదాలత్ జంక్షన్‌లోని అమరవీరుల స్తూపం, నక్కలగుట్టలోని ప్రజాకవి కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం సమర్పించారు. తమను క్రమబద్ధీకరించే వరకు సమ్మె విరమించేది లేదని ప్రతినపూనారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎండీ షఫీ, దొనికల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జనగామలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రుల మాస్కులు ధరించి ఉద్యోగులు నిరసన తెలిపారు. తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవీందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె ప్రదేశం నుంచి జాతీయ రహదారి వరకు శాంతియుత మహా ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్‌పాడ్యా, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ తదితరులు పాల్గొన్నారు.


జనగామలో మంత్రుల మాస్కులు ధరించి నిరసన

## సమ్మక్క తల్లీ దీవించు.. సీతక్క కరుణించు!

- మేడారంలో సీఆర్టీల మొక్కులు

ఏటూరునాగారం : సమ్మక్క తల్లి దీవించాలని, మంత్రి సీతక్క కరుణించాలని కోరుతూ సీఆర్టీలు మేడారంలోని గద్దెపై మోకాళ్ల మీద కూర్చొని మొక్కుకున్నారు. పదకొండు రోజులుగా సీఆర్టీలు ఐటీడీఏ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించకపోవడంతో గురువారం మేడారం వెళ్లి తమ ఉద్యోగాలు రెగ్యులర్ కావాలని సమ్మక్క-సారలమ్మ తల్లులను వేడుకున్నారు. ఈ సందర్భంగా వినూత్న రీతిలో ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్టీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొడెం రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరంసోత్ రాజు తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై కూర్చొని మొక్కులు చెల్లిస్తున్న సీఆర్టీలు




## బరిలోకి దిగితే పతకమే

దీప్తి బరిలోకి దిగితే కచ్చితంగా పతకం వస్తుందనే చెప్పాలి. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే పరుగు పందెంలో దృష్టి సారించింది. పారాలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం లక్ష్యంగా కఠోర శ్రమతో శిక్షణ తీసుకుంది. మెరుగులు దిద్దితే పల్లెల్లోనూ ఆణిముత్యాలు తయారవుతారనడానికి జీవంజి దీప్తి విజయాలే నిదర్శనం. తల్లిదండ్రుల సహకారం, ఆర్డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, హైదరాబాద్ గచ్చిబౌలిలోని సాయ్ అకాడమీ కోచ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్ ప్రోత్సాహం మరువలేనిదని దీప్తి పేర్కొన్నారు.

# దీప్తి.. అర్జున కీర్తి

## ఓరుగల్లు ముద్దుబిడ్డను వరించిన విశిష్ట పురస్కారం

**ఓరుగల్లు ఆణిముత్యం,** తెలంగాణ యువ పారా అథ్లెట్ జీవంజి దీప్తిని విశిష్ట పురస్కారమైన అర్జున అవార్డు వరించింది. కేంద్రం ప్రకటించిన జాతీయ క్రీడా అవార్డుల్లో పరుగుల రాణికి చోటు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తంకాగా, ఆమె స్వగ్రామం పర్వతగిరి మండలం కల్లెడ మురిసిపోయింది. పేదరికం, వైకల్యం రూపంలో చిన్నప్పటి నుంచే ఆమెకు ఎన్నో అవమానాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో సవాళ్లను ఎదుర్కొని ఆమెకే సొంతమైన చిరుత వేగంతో విజయ తీరాల వైపు పరుగు తీసింది. తన అసాధారణ ప్రతిభతో ఇప్పటికే ఎన్నో పతకాలతో పాటు ఇటీవలి పారాలింపిక్స్‌లో సత్తాచాటి ప్రపంచ రికార్డు సాధించింది. ఆమె పట్టుదల, క్రీడా అభిమానుల సహకారంతో ఇవాళ అరుదైన గౌరవం దక్కడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. ఈ నెల 17న రాష్ట్రపతి ముర్ము చేతులమీదుగా దీప్తి అర్జున అవార్డు అందుకోనున్నారు.

- పర్వతగిరి, జనవరి 2




తల్లిదండ్రులతో దీప్తి

**దీప్తి ప్రస్థానం ఎందరికో స్ఫూర్తి : మంత్రి కొండా సురేఖ**


మానసిక సమస్యలతో బాధపడుతున్నప్పటికీ కుంగిపోకుండా తన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిన అథ్లెట్ దీప్తి ప్రస్థానం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. దీప్తి మా సహకారం ఎల్లవేళలా ఉంటుంది. దీప్తి మరెన్నో కీర్తి శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నా. తెలంగాణ రాష్ర్టానికి పేరు తీసుకొచ్చిన అర్జున అవార్డు గ్రహీత జీవంజి దీప్తి యువతకు స్ఫూర్తిగా నిలిచింది.

**అవార్డు గర్వకారణం : మాజీ మంత్రి ఎర్రబెల్లి**

జీవంజి దీప్తికి అర్జున అవార్డు రావడం ఎంతో గర్వకారణమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని దీప్తి విజయం నిరూపించింది. పారాలింపిక్స్ క్రీడా విజేత జీవంజి దీప్తికి అర్జున అవార్డు వరించడం నేటి యువతకు స్ఫూర్తినింపిందని ఆర్డీఎఫ్ అధినేత ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు ప్రశంసించారు.

**ఇటీవల దీప్తి సాధించిన ఘన విజయాలు**

2022 సెప్టెంబర్‌లో వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్‌లో 400 మీటర్ల పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. 2022 నవంబర్‌లో ఆస్ట్రేలియాలో ఏషియా గేమ్స్ లో 200 మీటర్ల లో బంగారు పతకం, 400 మీటర్లలో బంగారు పతకం, ఫ్రాన్స్‌లో ఏషియా గేమ్స్ 2023 జూన్‌లో 200 మీటర్లలో సిల్వర్ మెడల్, 400 మీటర్లలో సిల్వర్ మెడల్, చైనాలో 2023 అక్టోబర్‌లో ఏషియన్ పారా గేమ్స్‌లో 400 మీటర్లలో బంగారు పతకం సాధించింది. జపాన్‌లో 2024 మేలో వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల పోటీలలో బంగారు పతకం సాధించింది.


దీప్తి స్వగ్రామం కల్లెడ

కల్లెడకు చెందిన జీవంజి దీప్తిది పేద కుటుంబం. చిరుత వేగం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. బరిలోకి దిగితే ఆమెకు ఆమే సాటి. పేద కుటుంబంలో పుట్టినా చిన్నప్పటి నుంచి పరుగుపందెంలో తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంది. గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో జీవంజి దీప్తి విద్యాభ్యాసం చేస్తూ తన నాల్గో తరగతి నుంచే రన్నింగ్‌పై మక్కువ పెంచుకుంది. ఇంటి నుంచి పాఠశాలకు.. పాఠశాల నుంచి ఇంటికి పరుగెత్తుతూనే వెళ్లేది. ఆమెలోని అసాధారణ ప్రతిభను గుర్తించిన ఆర్డీఎఫ్ వ్యవస్థాపకులు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు దీప్తిని క్రీడల వైపు ప్రోత్సహించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్ ద్వారా ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. అథ్లెటిక్స్‌లో జిల్లా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపడంతో 2016లో పాఠశాల స్థాయిలోనే 'సాయ్' శిక్షణకు ఎంపికైంది. శిక్షణ తీసుకుంటూ అక్కడే విద్యాభ్యాసం కొనసాగించింది. ఓ వైపు తొర్రూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా సాధన చేసి, 2016లో కరీంనగర్‌లో జరిగిన జూనియర్ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల, 200 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించింది.

- పారా అథ్లెట్‌కు అరుదైన గౌరవం
- జాతీయ క్రీడా అవార్డుల్లో చోటు దక్కడంతో మురిసిన కల్లెడ
- వైకల్యాన్ని జయించి విజయశిఖరాలకు పయనం
- అవమానాలను అధిగమించి అర్జున సొంతం
- మంత్రి సురేఖ, మాజీ మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు
- నేటి యువతకు స్ఫూర్తిదాయకం

- 2017 లో కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్, గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్‌లో అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో 200, 400 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించింది.
- 2018లో రాంచీలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో బంగారు పతకం సాధించింది.
- 2019లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన యూత్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించింది. మహారాష్ట్రలో జరిగిన ఖేలో ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్ల పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో బంగారు పతకంతో పాటు 100 మీటర్లలో న్యూమీట్ రికార్డ్ను సైతం సృష్టించింది.
- గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్‌మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్ సాధించింది.
- పంజాబ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్‌మెడల్, 200 మీటర్లలో సిల్వర్‌మెడల్ కైవసం చేసుకుంది.
- హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లలో కాంస్య పతకం
- మిడ్ రిలే పోటీల్లో రజతం, మొరాకోలో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది.



## దీప్తికి డీవైఎస్‌వో అభినందనలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 2 : పారాలింపిక్స్‌లో భారత్ తరఫున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజీ అర్జున అవార్డుకు ఎంపిక కావడంపై హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్ అభినందనలు తెలిపారు. కల్లెడ నుంచి మొదలు పారిస్ ఒలింపిక్స్ వరకు కొనసాగిన దీప్తి ప్రస్థానం యువ క్రీడాకారులకు ఆదర్శనీయమన్నారు.


దీప్తిని అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

# సెల్‌ఫోన్ కోసం విద్యార్థుల ఘర్షణ

**ఐదుగురిని సస్పెండ్ చేసిన గురుకుల ప్రిన్సిపాల్**

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : మహబూబాబాద్ పట్టణ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో సెల్‌ఫోన్ విషయంలో బుధవారం రాత్రి విద్యార్థులు ఘర్షణ పడ్డారు. మధ్యాహ్నం గురుకులంలో వాటర్ పోసేందుకు ఆటోలో వాటర్ మెన్ రాగా, క్యాన్లను లెక్కించేందుకు 9వ తరగతి విద్యార్థి రాజేందర్‌ను టీచర్లు అక్కడ ఉంచారు. నీళ్లలో పడుతుందని వాటర్‌మెన్ తన సెల్‌ఫోన్‌ను రాజేందర్‌కు ఇవ్వగా, 10వ తరగతి విద్యార్థి రేవంత్ వచ్చి ఫోన్ చేసుకుంటానని అడిగితే ఇవ్వలేదు. దీనిని మనసులో పెట్టుకున్న రేవంత్ అర్ధరాత్రి తన స్నేహితులతో కలిసి రాజేందర్‌ను కొట్టడంతో అతడు వ్యాయామ ఉపాధ్యాయుడికి చెప్పాడు. రాజేందర్‌ను ఎందుకు కొట్టావని గురువారం వ్యాయామ ఉపాధ్యాయుడు రేవంత్‌ను కర్రతో కొట్టాడు. దీంతో అతడికి ఎర్రగా దద్దులు రావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి వ్యాయామ ఉపాధ్యాయుడితో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇద్దరిని పిలిపించి జరిగిన సంగతి చెప్పడంతో పేరెంట్స్ వెళ్లిపోయారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ రాజేశ్‌ను వివరణ కోరగా 9వ తరగతి విద్యార్థి రాజేందర్‌ను రేవంత్, అతడి స్నేహితులు కొట్టారని, ఈ విషయంపై టీచర్లతో విచారించి ఐదుగురు విద్యార్థులను పాఠశాల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



మహబూబాబాద్ శివారులోని ఎంజేపీ గురుకుల పాఠశాల

# విలీనం చేయొద్దు

- వరంగల్ కలెక్టరేట్ ఎదుట పత్తినాయక్ తండావాసుల ధర్నా
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహం
- దొంతికి వ్యతిరేకంగా నినాదాలు

ఖిలావరంగల్, జనవరి 2: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామపంచాయతీలో తమను విలీనం చేయొద్దని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన, లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పత్తినాయక్ తండావాసులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ సర్కారు, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు కునుసోతు మురళీనాయక్ మాట్లాడుతూ తండాల విలీనంతో గిరిజనుల రాజ్యాధికారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని అన్నారు. నియోజకవర్గంలోని ఒక తండాను కూడా వదులుకోమన్నారు. 2000 మందితో గ్రామపంచాయతీగా ఉన్న పత్తినాయక్‌తండాను అమీనాబాద్ జీపీలో విలీనం చేసేందుకు గత డిసెంబర్ 31వ తేదీన కుట్రలకు తెరలేపారన్నారు. గ్రామ సభ పేరుతో ఎమ్మెల్యే సొంత గ్రామమైన అమీనాబాద్‌లో విలీనం చేసేందుకు పోలీసులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. అయితే పత్తినాయక్‌తండా ప్రజలు మాత్రం విలీనాన్ని తిరస్కరించారన్నారు. మా తండాలో మా రాజ్యం పేరుతో స్వయంపాలన కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీలుగా ఏర్పాటు చేస్తే ప్రజాప్రతినిధుల స్వార్థం కోసం విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. విలీనాన్ని మానుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వాంకుడోత్ అశోక్ నాయక్, నాయకులు ఇస్లావత్ వీరేందర్‌నాయక్, అఖిల్‌నాయక్, ఎల్‌పీహెచ్‌సీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్, జిల్లా అధ్యక్షుడు జగన్‌నాయక్, నర్సంపేట ఇన్‌చార్జి గుగులోత్ రామస్వామీనాయక్, నల్లబెల్లి మాజీ ఎంపీపీ సారంగపాణి, నెక్కొండ మాజీ ఎంపీపీ జాటోత్ రమేశ్, బోడ బద్దునాయక్, మాజీ సర్పంచ్ జాటోత్ స్వామి, బోడ మురళీనాయక్, శోభన్ పాల్గొన్నారు.


వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పత్తినాయక్ తండావాసులు


# తగ్గిన రిజిస్ట్రేషన్లు.. పెరిగిన మార్టిగేజ్‌లు

- రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గడంతో ప్రభావం
- ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతాని కన్నా సగం తగ్గిన రిజిస్ట్రేషన్లు

కరీమాబాద్, జనవరి2: గత ప్రభుత్వ హయాంలో క్రయవిక్రయాలు జరుపుకునే జనంతో కళకళలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నేడు బోసిపోతున్నది. గడిచిన ఏడాది కాలంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం తగ్గడంతో ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు బాగా తగ్గిపోయాయి. ప్రభుత్వ నిర్ణయాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలతో క్రయవిక్రయాలు బాగా తగ్గాయని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. గతంలో పోలిస్తే రిజిస్ట్రేషన్లు సగం వరకు తగ్గినట్లుగా తెలుస్తున్నది. గత ఏడాదిలో 12,800 నుంచి 13,000 వరకు రిజిస్ట్రేష న్లు కాగా, ప్రస్తుత ఏడాది కాలంలో 8000-9000 వరకు జరినట్లు సిబ్బంది చెబుతున్నారు. అందులోనూ 3000 నుంచి 3500 వరకు మార్టిగేజ్‌లు చేసుకున్నట్లు చెప్పడం గమనార్హం. అటు వ్యాపారాలు లేక ఆదాయాలు తగ్గిపోవడంతో చాలా మంది బ్యాంకు, ఇతర ప్రైవేట్ సంస్థల వద్ద రుణాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ మార్పు వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే రియల్‌రంగంపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు పడక తప్పదని పలువురు రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రారంభమైన టెట్

హనుమకొండ చౌరస్తా, జనవరి 2 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు ప్రారంభమయ్యాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఉదయం 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వరంగల్ నగరంలోని 9 ఆన్‌లైన్ కేంద్రాల్లో గురువారం నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు విద్యాశాఖ అధికారులు వెల్లడించలేదు.


జయ నర్సింగ్ కాలేజీలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు